'తపస్'ను బలపరచండి



మల్కాజిగిరి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)ను బలపరచాలని రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ పిలుపు నిచ్చారు. బుధవారం మల్కాజిగిరి మండల పరిధిలోని పలు పాఠశాలల్లో 2025–26 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపస్ కేవలం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇటీవల జరిగిన రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ విజయం సాధించిందన్నారు. జిల్లా, మండల నాయకులు రాజ్‌కుమార్, రమేష్‌రాథోడ్, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

ఉప్పల్: భారతీయ మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు హాంషి శశ్వత్‌కుమార్‌కు 'గ్రాండ్ మాస్టర్ ఆఫ్‌ది ఇయర్–2025' అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారాన్ని మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అందించినట్లు శశ్వత్‌కుమార్ తెలిపారు. సర్బియాలో 2025 జూలై 14న నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేసినట్లు వివరించారు.

మత్స్యకారుల సంఘం నూతన కార్యవర్గం

ఉప్పల్: తెలంగాణ మత్స్యకారుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా ఈగ లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చిల్కూరి సత్యవతి, చంద్ర పుష్ప, రాజమణి, నవనీత, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బక్కి బాలమణి, సహాయ కార్యదర్శులుగా జగదీశ్, వెంకటేష్, కవిత, భాగ్య తదితరులు ఎంపికయ్యారు. ఈ ఎన్నికలను జాతీయ కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహా సమక్షంలో జరిగినట్లు తెలిపారు.

బాక్స్ డ్రెయిన్ సమస్యను పరిష్కరించాలి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీలో బాక్స్ డ్రెయిన్‌కు రూ.73 లక్షలు మంజూరై రెండేళ్లు గడిచినా ఇంకా పనులు ప్రారంభం కాలేదని, బుధవారం కాప్రా సర్కిల్ ఈఈ నాగేందర్‌కు కాలనీవాసులతో కలిసి గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, భవానీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిర్మలాదేవీ, మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వంగవీటి విను, శ్రవణ్‌గౌడ్ తదితరులున్నారు.

ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష

కుషాయిగూడ: డివిజన్ అభివృద్ధి పనులపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై చర్చించి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

మల్లాపూర్: ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, ఆక్టీవిటీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని బుధవారం ఈఎస్ఐ ఆస్పత్రి డైరెక్టర్ దానకిషోర్‌కు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుకుమార్, ఆసుపత్రి నాయకులు క్రాంతి, లింగన్న, నరసింహ, పద్మ, నిరంకారి తదితరులు పాల్గొన్నారు.

రాముయాదవ్ హౌస్ అరెస్ట్

గౌతంనగర్: డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత భర్త, బీఆర్ఎస్ నేత మేకల రాముయాదవ్ హౌస్ అరెస్ట్ అయ్యారు. అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య జరిగిన గొడవలో ఆయన గాయపడిన విషయం తెలిసిందే. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుధవారం ఆయనను మల్కాజిగిరి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

అల్వాల్: అల్వాల్‌లోని సఖి–1 కేంద్రంలో ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ చైర్మన్, సీనియర్ జడ్జి కిరణ్‌కుమార్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉచిత న్యాయ సేవలు అందుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.



ట్రా'ఫికర్' !

ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల ఇబ్బంది

- బాటసారులకు తప్పని తిప్పలు
- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



బాలాజీనగర్‌లో బస్సుల రద్దీ (ఫైల్)

జవహర్‌నగర్: కార్పొరేషన్‌గా జవహర్‌నగర్, మున్సిపాలిటీలుగా నాగారం, దమ్మాయిగూడ ఏర్పడి 6 ఏళ్లు దగ్గరపడుతున్నా.. ఇప్పటికీ ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. ప్రధానంగా అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, చెన్నాపురం, నాగారం, దమ్మాయిగూడ ప్రాంతాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఈ సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారనే ఆరోపణలున్నాయి.

అధికారులపై ఆరోపణలు..

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు ఘోరంగా విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య చిన్నగానే కనిపించినా.. వాహనదారులకు ప్రతిరోజూ నరకం చూపిస్తోంది. సాక్షాత్తు కార్పొరేషన్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఎదుట సరైన రోడ్లు, సిగ్నల్స్ పనిచేయని దుస్థితి నెలకొంది. ఇక రోడ్లపైనే ఇష్టానుసారంగా పార్కింగ్‌లు, తోపుడు బండ్లు, దుకాణాలు కొనసాగుతుండగా.. బాటసారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్‌లో నిత్యం నరకం..

బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్ ప్రధాన రహదారులలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. హకీంపేట, సికింద్రాబాద్, ఈసీఐఎల్, ఉప్పల్ కంటోన్మెంట్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వందలాది ఆర్టీసీ బస్సులు నిత్యం వస్తుంటాయి. అసలే ఇరుకు రోడ్లు ఆ రోడ్డులో సగందాకా దుకాణాలు వెలుస్తున్నాయి. ట్రాఫిక్ అధికంగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.



జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

డంపింగ్ వాహనాలతో సమస్య..

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌కు నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. వాటిలో కొన్ని బాలాజీనగర్ నుంచి వెళ్తుండటంతో రోడ్లు ఇరుకుగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. వాణిజ్య పరంగా పేరున్న జవహర్‌నగర్ పట్టణం కూడా రోజురోజుకూ పెరుగుతోంది. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు లేక ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు..

దుకాణదారులు రోడ్డుపైకి వచ్చి వస్తువులు పెడుతుండటంతో భారీ వాహనాలు వస్తే మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ లేక రాంగ్‌రూట్‌లో ఎక్కువగా వాహనదారులు ప్రయాణిస్తున్నారు.

ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు

గతేడాది సెప్టెంబర్‌లో డంపింగ్‌యార్డ్ వద్ద డివైడర్ లేకపోవడంతో భారీ వాహనాలు ఎదురుగా రావడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఇటీవల మరణించాడు.

రోడ్డు విస్తరణ చేయకుండానే...

బాలాజీనగర్ ప్రధాన రహదారి విస్తరణ చేయకుండానే రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. ఇక్కడే 2 వైన్స్ దుకాణాలు, 2 బార్లు నడుస్తుండటంతో వాహనదారులు రోడ్డుపై పార్కింగ్ చేసి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో మహిళలు అక్కడి నుంచి నడవాలంటేనే జంకుతున్నారు. బస్టాండ్ కూడళ్లలో ప్రైవేట్ వాహనాలు ఇష్టానుసారంగా నిలపడం ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకుని ప్రధాన రహదారిని విస్తరించి, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టి సమస్యను పరిష్కరించాలి



పట్టణానికి తగినట్లు 100 ఫీట్ రోడ్డును ఏర్పాటు చేసి డివైడర్‌తో పాటు అన్ని ప్రధాన సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి. దుకాణదారుల అక్రమ పార్కింగ్‌లను తొలగించి తగిన చర్యలు తీసుకోవాలి. బాలాజీనగర్‌లో 55 నుంచి 35 ఫీట్లకు రోడ్డును కుదించడం సరికాదు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– రాహుల్, జవహర్‌నగర్

సమస్యను పరిష్కరిస్తాం



జవహర్‌నగర్, నాగారం, దమ్మాయిగూడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య కొంత ఇబ్బందికరంగానే ఉంది. త్వరలోనే అన్ని ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ సమస్యను పరిష్కరిస్తాం. రోడ్లపై ఆక్రమణలు, పార్కింగ్ తదితర సమస్యలపై వివిధశాఖల అధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటాం.

– శివకుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

రూ.59 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ రాంనగర్ కాలనీలో రూ. 59 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఒక్క చిలుకానగర్ డివిజన్‌లోనే దాదాపుగా రూ.95 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించినట్లు వివరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల కంటే అధికంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. స్థానికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 15వ డివిజన్‌లో రూ.20లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం 6వ డివిజన్‌లో పార్కు మరమ్మతుల పనులను పరిశీలించారు. మేడ్చల్ నియోజకవర్గ బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మేయర్ అజయ్‌యాదవ్

రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత అవగాహన శిబిరం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మహాత్మాగాంధీ నగర్‌లో ఏఐజీ ఆసుపత్రి, గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీ సంయుక్తాధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రచార కార్యదర్శిసుజాత నేతృత్వంలో బుధవారం ఉచిత రొమ్ము క్యాన్సర్, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని 20 ఏళ్లు పైబడిన మహిళలకు రొమ్ము పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం ఈ వ్యాధి పెరుగుతుందని ముందస్తుగానే గుర్తించి చికిత్స చేస్తే సులభతరం అవుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర మహిళ ఆఫీస్ ఇన్‌చార్జ్ ప్రసన్న, జిల్లా కార్యవర్గసభ్యులు ప్రదీప్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ప్రమాణం చేయిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ సంగీతాకుమారి

కుషాయిగూడ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని తెలంగాణ గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సంగీతాకుమారి అన్నారు. బుధవారం ఈసీఐఎల్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో 'ఇన్‌వేస్టరీ సెర్మనీ' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కెబినెట్ మెంబర్స్‌గా నియమితులైన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం వారితో ప్రమాణం చేయించి గౌరవ వందనం స్వీకరించారు. చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ లలిత, డీన్ శ్రీలత, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యం

మేడిపల్లి: ఏటీఎల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయత అవగాహన, పరిశోధన, పరిశీలన, సృజనాత్మకతను విద్యార్థుల్లో పెంపొందించవచ్చని డీఈఓ విజయకుమారి అన్నారు. మేడిపల్లి ప్రధానోపాధ్యాయుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఏటీఎల్ ల్యాబ్ అవగాహన ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. కాలానికనుగుణంగా సాంకేతికతపై అవగాహనకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సాంకేతిక విద్యలో మేళకువలు నేర్పడానికి ఈ ఏటీఎల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల్లో ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందించడమే ఏటీఎల్ ల్యాబ్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. ఏటీఎల్ ల్యాబ్ నీతిఅయోగ్ ఆధ్వర్యంలో అమలు అవుతున్న అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో భాగంగానే ఏర్పడిందని స్పష్టం చేశారు. ఏఎంఓ రవీందర్‌రాజు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ విజయకుమారి

ప్రమాద బీమా అందజేత

అల్వాల్: యాప్రాల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ చంద్రగిరిరాజు ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన యాప్రాల్‌లో నివసించే డ్వాక్రా మహిళ సభ్యురాలు శోభ కుటుంబానికి కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ – యూనియన్ రిన్ సురక్ష పాలసీ ద్వారా రూ.5 లక్షల బీమా చెక్కును బుధవారం అందజేశారు. సికింద్రాబాద్ డివిజన్ రీజనల్ హెడ్ భాస్కర్ మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. ఇన్సూరెన్స్ ప్రతినిధులు శివశంకర్, మౌలానా, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



మర్యాద పూర్వక కలయిక



డీసీని శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజును ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ నేతలు గడ్డ రవికుమార్, గిరిబాబులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీసీ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు ఎర్రం శ్రీనివాస్, విజయ్‌కుమార్, బిక్షపతి, లక్ష్మణ్, కుమార్ తదితరులున్నారు.



చాణిక్యపురి కాలనీలో..



బాబానగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మురుగు.. పరుగు !

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని చాణిక్యపురి కాలనీ, బాబానగర్‌లో గత వారం రోజులుగా మురుగు రోడ్లపై పారుతోంది. దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. జలమండలి అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

డివిజన్ అభివృద్ధికి రూ.1.33 కోట్లు

కాప్రా: అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కాప్రా డివిజన్‌కు రూ. 1.33 కోట్లు మంజూరయ్యాయి. ఎల్లారెడ్డిగూడ శ్మశానవాటికలో కనీస సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులకు రూ.84 లక్షలు, కృష్ణానగర్, ఎల్లారెడ్డిగూడలో సీసీరోడ్లకు రూ. 49.50 లక్షల మంజూరు పత్రాలను బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు రాబట్టి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ నేతలు విఠల్ నాయ్, నాగేశు, పూర్ణయాదవ్, మల్లారెడ్డి, నాగరాజు, శ్రీధర్‌రెడ్డి, సత్తిరెడ్డి, మల్లేష్ ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

రామంతాపూర్ : ప్రభుత్వ దేవాదాయశాఖ రామంతాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంజూరు చేసిన రూ. 40 లక్షల నిధుల పత్రాన్ని బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 125 ఏళ్ల పురాతన మల్లికార్జునస్వామి స్వయంభూ శివలింగంతో కూడిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖకు వివరించానని ఆలయ పునరుద్ధరణకు నిధుల మంజూరు చేయాలని కోరడంతో వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేందర్, ప్రధాన అర్చకులు మోత్కూరు శేఖర్‌బాబుశర్మ, సతీష్‌గౌడ్, జంగయ్య, శోభాలింగం, రామకృష్ణ, యాదగిరి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతల పండుగ



సీతల పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న లక్ష్మీరవిగౌడ్

బోడుప్పల్: సీతల పండుగ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ అన్నారు. చెంగిచర్ల బంజార అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతల పండుగ ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీలత భద్రునాయక్, బంజారా మహిళలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తాం

ఐలా 21వ, సీఐఏ 20వ వార్షిక జనరల్ బాడీ సమావేశం

కుషాయిగూడ: కార్మికుల సంక్షేమం, పారిశ్రామికవాడ అభివృద్ధిపై రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టో హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని ఐలా చైర్మన్ గోవిందరెడ్డి, సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐలా 21వ, సీఐఏ 20వ వార్షిక జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సీఐఏ, ఐలా ప్రతినిధులను ఘనంగా సత్కరించి వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రధానంగా లీగల్‌సెల్ ఏర్పాటు చేసి పారిశ్రామికవేత్తలకు న్యాయసాయం అందేలా చూస్తామని, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను మరోసారి చదివి వినిపించారు. ఐలా మాజీ చైర్మన్ రోశిరెడ్డి, ఐలా వైస్ చైర్మన్ శ్రీనివాస్, సెక్రటరీ రాఘవయ్య, జాయింట్ సెక్రటరీ సురేష్, ట్రెజరర్ మల్లికార్జున్‌రెడ్డి, సీఐఏ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ మోహన్, జాయింట్ సెక్రటరీ గంగాధర్‌బాబు, ట్రెజరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

బోనాల చెక్కుల ప్రోటోకాల్ వివాదంపై..

పోలీస్ ఉన్నతాధికారులకు వివరించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అల్వాల్: బాలాజీ వేంకటేశ్వర దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘన వివాదంపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సీపీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్పొరేటర్లు శాంతి, సబిత, బీఆర్ఎస్ నేతలు బద్దం పరుశురామ్‌రెడ్డి, మురుగేష్, నరేందర్‌రెడ్డి, అనిల్‌కిషోర్‌గౌడ్, రమేష్, హేమంత్ పటేల్, పరమేష్ తదితరులున్నారు.

తెలంగాణ డీజీపీ జితేందర్‌ను కలిసిన ఎమ్మెల్యే

అల్వాల్: బాలాజీ వేంకటేశ్వర దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘన వివాదంపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ ముఖ్య కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ జితేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కుషాయిగూడ: బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి సూచించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయాల నిర్వాహకులు, ఫలహారం బండి ఊరేగింపుల నిర్వాహకులతో బుధవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాహకులు విధిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను చేసుకుని పోలీసులకు సహకరించాలన్నారు. ఎస్సైలు శ్రీనివాస్, వెంకన్న, సాయిలు, బీజేపీ నేతలు రజనీకాంత్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి